క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కేశంపేట: ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రాజేందర్‌రెడ్డిని మంగళవారం పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తహసీల్దార్‌కు వేర్వేరుగా పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమాల్లో నాయకులు జంగయ్య, అజహర్, రమేశ్, రాఘవేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, కృష్ణయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న సూపర్‌మార్కెట్ యజమాని

శంకర్‌పల్లి: ఇటీవల కురిసిన వర్షానికి శంకర్‌పల్లి–సంగారెడ్డి ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఆ రోడ్డులో ఎస్‌బీ సూపర్ మార్కెట్ ఎదురుగా పరిస్థితి దారుణంగా మారడంతో మంగళవారం మార్కెట్ యాజమాన్యం స్పందించి.. గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా వాహనదారులు యాజమాన్యం కృషిపై హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు లింగాకర్షక బుట్టల పంపిణీ



లింగాకర్షక బుట్టలతో రైతులు, అధికారులు

యాచారం: మండల పరిధి చొదర్‌పల్లిలోని రైతులకు మంగళవారం లింగాకర్షక బుట్టల పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ పొలాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పంటల సాగులో పురుగు ఉనికి, పురుగు ఉధృతి నివారణకు లింగాకర్షక బుట్టల వాడకాన్ని రైతులకు తెలియజేశారు. పంటల సాగులో అవగాహన, చైతన్యం కలిగి ఉంటే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బసవన్నప్ప, వెంకట్‌రెడ్డి, ఉదయ్‌శంకర్, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్, విస్తరణ అధికారి రాధ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

మండల పశువైద్యాధికారి భానునాయక్

కడ్తాల్: పశుపోషణలో జాగ్రత్తలు, మెలకువలు పాటించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ పశుపోషకులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడతండాలో, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆవులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. సాధారణ జ్వరంతో బాధపడుతున్న ఆవులకు, దూడలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భానునాయక్ మాట్లాడుతూ.. పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల్లో అనంతరం రైతుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి చేయూత

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో లక్ష రూపాయల వ్యయంతో గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి అర్థం లక్ష్మీనారాయణగుప్తా స్టేజీ నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్టేజీ నిర్మాణ దాత లక్ష్మయ్య గుప్తాను అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో అర్థం సంధ్యారాణి, పాఠశాల హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు రఘుపతి, దేశ్‌పాండే, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి మోక్షం

- కవేలిగూడ–చందానగర్ రహదారికి రూ.30 కోట్లు మంజూరు
- ఆయా గ్రామాల వద్ద మొదలైన సర్వే పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



చందానగర్–కవేలిగూడ రోడ్డు

మొయినాబాద్: మూడు మండలాలను కలిపే రోడ్డు అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పంచాయతీరాజ్ శాఖ నుంచి రోడ్లు, భవనాల శాఖకు మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 16 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. దీంతో సర్వే పనులు మొదలయ్యాయి.

వినతులకు స్పందన

మండలంలోని చందానగర్ చౌరస్తా నుంచి పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ మీదుగా శంషాబాద్ మండలంలోని కవేలిగూడ వరకు పంచాయతీరాజ్‌శాఖ రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖకు మారింది. 16 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీకి మార్చాలంటూ గత సంవత్సర కాలంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొయినాబాద్‌కు వచ్చిన సందర్భంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై చాలాసార్లు అధికారులు, మంత్రులను కలిసి విన్నవించారు. ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి సైతం ఈ రోడ్ల అవసరాన్ని తెలియజేస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేఖ రాశారు. గతంలోనే సర్వే చేసిన అధికారులు రోడ్డు విస్తరణకు రూ.60 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. కానీ ఆ రోడ్డును ఆర్ అండ్‌బీ శాఖకు మార్చడంలో ఆలస్యం జరిగింది.

ఉత్తర్వులు జారీ

మండంలోని చందానగర్ నుంచి కవేలిగూడ వరకు 16 కిలోమీటర్ల దూరం రోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు మారుస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రోడ్డు విస్తరణకు ప్రస్తుతం సీఆర్‌ఐఎఫ్(సెంటర్ రోడ్డు అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధులు రూ.30 కోట్లు మంజూరు చేసింది. నిధుల మంజూరుతో రోడ్డు విస్తరణకు సంబంధించిన సర్వే పనులను అధికారులు మొదలుపెట్టారు. సర్వే చేసి మార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

తీరనున్న సమస్య

చందానగర్ నుంచి కవేలిగూడ వరకు రోడ్డు విస్తరణతో మూడు మండలాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి. మొయినాబాద్ నుంచి శంషాబాద్, షాబాద్, షాద్‌నగర్ వెళ్లాలంటే ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణతో వారి ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

> **రోడ్డు విస్తరణతో మేలు**
>
> చందానగర్ చౌరస్తా నుంచి పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ మీదుగా కవేలిగూడ వరకు రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షనీయం. ఈ రోడ్డు అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. మొయినాబాద్ నుంచి శంషాబాద్, షాబాద్, షాద్‌నగర్ వెళ్లడానికి దగ్గరి దారి అవుతుంది. అధికారులు పనులు వేగంగా చేస్తే మంచిది.
>
> –గడ్డం వెంకట్‌రెడ్డి, సురంగల్, మొయినాబాద్ మున్సిపాలిటీ

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చొద్దు

సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు



ట్రిపుల్‌ఆర్ ప్రతిపాదనలో పోతున్న రైతుల భూములను పరిశీలిస్తున్న నాయకులు

కొందుర్గు: పేద, మధ్య తరగతి భూములే టార్గెట్‌గా రూపొందించిన కొత్త అలైన్‌మెంట్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని తంగెళ్లపల్లి గ్రామాన్ని సందర్శించి, రైతుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీజనల్ రింగ్ రోడ్డు అంటే రింగ్‌లా ఉండాలని, వంకలుగా కాదన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం రోడ్డు అలైన్‌మెంట్ మార్చుతున్నారని ప్రశ్నించారు. రియల్ వ్యాపారుల లబ్ధి కోసం పేద రైతులు బతికే పొలాల నుంచి రోడ్డు వేయడం దారుణమన్నారు. పొలాలను సాగు చేసుకొని జీవనం సాగించే రైతుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. వెంటనే ట్రిపుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్ మానుకొని, తిరిగి పాత అలైన్‌మెంట్ ప్రకారమే వేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతుల పక్షాన పోరాటం చేసేందుకు సీపీఎం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, శ్రీను, పద్మారెడ్డి, రవీందర్ రెడ్డి, బాల్‌రాజ్, జంగయ్య, వెంకటేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్లు పెంచాలి

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సభ్యుడు యాదయ్య



ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగుల కమిటీ సభ్యులు

చేవెళ్ల: దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, రూ.6వేలు పెన్షన్‌ను వెంటనే ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సభ్యుడు యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ రాజశేఖర్‌కు మంగళవారం కమిటీ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని మాటతప్పిందన్నారు. వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌లను పెంచటంతో పాటు కొత్త వారికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బోడ శ్రీనివాస్, మొయినాబాద్ మండల నాయకులు కుమార్, రజినికాంత్ ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు లింగంగౌడ్

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ సమీపంలో గల ఓ హాల్‌లో మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.శశిధర్, ఉపాధ్యక్షులుగా అజీజ్‌నగర్ రాజేందర్‌రెడ్డి, సందీప్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా మధుసాగర్, కుటుంబ భరోసా సభ్యులుగా చిలుకూరి నాగరాజు, జాయింట్ సెక్రటరీగా శ్రావణ్, ముఖ్య సలహాదారులుగా పలువురు ఏకగ్రీవంగా ఎన్నుకొని సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫొటో, వీడియోగ్రాఫర్ల సభ్యులందరూ సంక్షేమ, ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటో, వీడియోగ్రాఫిలో ఎంతో టెక్నాలజీ పెరిగిపోయిందన్నారు. దానిని అనుసంధానం చేసుకునేందుకు తరగతి శిక్షణలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఫొటోగ్రాఫర్ల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో పోటీతత్వానికి తగ్గట్లు ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో విష్ణుగౌడ్, బండ్లగూడ శ్రీధర్, వడ్ల రమేష్‌చారి, మాజీ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: మల్లారెడ్డిగూడలో..



మొయినాబాద్: హిమాయత్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలు వైభవంగా జరుపుకొంటున్నారు. మంగళవారం రెండోరోజు చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల వద్ద హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టారు.



చేవెళ్ల: రచ్చబండ వద్ద నృత్యాలు చేస్తున్న చిన్నారులు



మొయినాబాద్: పెద్దమంగళారంలో..



చేవెళ్ల: రచ్చబండ వద్ద పూజలో పాల్గొన్న భక్తులు, నాయకులు



చేవెళ్ల: మల్కాపూర్‌లో..

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



షాద్‌నగర్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. తద్వారా మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, భీష్మ రామకృష్ణ, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

నందిగామ: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై శంకుస్థాపన చేశారు. అంతిరెడ్డిగూడ పరిధిలోని పృథ్వీ కాలనీలో సీసీరోడ్లు, నర్సప్పగూడ, చేగూరు గ్రామాల మధ్యన వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచాల: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని జాపాలలో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సమస్యలపై పంచాయతీ కార్యదర్శి మరళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వై.జగన్, లెనిన్, గ్రామ కార్యదర్శి పాపిరెడ్డి, నాయకులు జంగయ్య, వినోద్, నర్సింహ, భాస్కర్, పాండు, రావూఫ్, లచ్చినారి, ఆసిఫ్, లక్ష్మణ్, శ్యాం, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మండల వ్యవసాయ అధికారి అనురాధ



రైతులతో మాట్లాడుతున్న అనురాధ

మొయినాబాద్ రూరల్: రైతులు సాగుచేసిన పంటలకు ప్రభుత్వం ద్వారా అవసరమైన యూరియాను సరఫరా చేస్తుందని, ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మంగళవారం మండల రైతు వేదికలో రైతులకు యూరియా కోసం టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగు చేసుకున్న పంటలకు ప్రభుత్వం ద్వారా యూరియా అసరమైనంత సరఫరా అవుతుందని, ఎవరూ తొందరపడొద్దని సూచించారు. మండలానికి ఇప్పటివరకు 550ల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. ఇంకా యూరియా సరఫరా చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కునే పని సరికాదు

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్



రైతులతో మాట్లాడుతున్న దశరథ్

చేవెళ్ల: పేదలకు ఇచ్చిన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఎలాంటి ప్రాజెక్టు ప్రకటించకుండా తీసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టడం సరైనది కాదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. మండలంలోని హస్తేపూర్‌లో ఉన్న దాదాపు 400ల ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలియటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై మంగళవారం గ్రామంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల ముందు గతంలో ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని రెగ్యులర్ చేస్తామని చెప్పి.. ఇప్పుడు అన్ని భూములను లాక్కునే పని చేపట్టిందని మండిపడ్డారు. మండలంలోని హస్తేపూర్ పరిధిలో ఉన్న 400ల ఎకరాల ప్రభుత్వ భూమిని రైతుల నుంచి సేకరించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఎలాంటి ప్రాజెక్టు ప్రకటించకుండానే రైతుల నుంచి భూములు ఎందుకు తీసుకుంటున్నారని, ఎవరికి కట్టబెట్టేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. వెంటనే హస్తేపూర్‌లో భూసేకరణ ప్రక్రియ నిలిపివేయాలని, దీనికి గల కారణాలు ఏమిటో.. ఏ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్నారో ముందుగా ప్రకటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులకు మేలు చేయాలన, లేని పక్షంలో హస్తేపూర్ మరో లగచర్ల ఉద్యమానికి దారి తీస్తోందని హెచ్చరించారు. ఏమి తెలియని పేద రైతులను మభ్యపెట్టి మాయ చేస్తామంటే సహించేది లేదన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్ల: శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు రామ్మోహన్‌గౌడ్, వజ్రేస్, బండి రమేశ్, పరమేశ్వర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చేవెళ్ల: చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి నాయకులు కలిసి..

శంకర్‌పల్లి: మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండల నాయకులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, రఘునందన్‌రెడ్డి, ప్రశాంత్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో నాయకులు